
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4 : కనిష్ఠం 24.1
నిజామాబాద్ జిల్లా వార్తలు
5
ఆదివారం 14 ఏప్రిల్ 2024







అకాల వర్షం.. అపార నష్టం!

- జిల్లాలో మూడురోజులుగా వర్షాలు
- రాత్రివేళల్లో కురుస్తున్న వర్షానికి తడిసిపోయిన ధాన్యం
- వేలాది ఎకరాల్లో తడిసిన పంట
- పలు గ్రామాల్లో నేలకొరిగిన వరి
- ధాన్యం కొనుగోలు వేగంగా చేపట్టాలంటున్న రైతులు
- జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన యంత్రాంగం

నిజామాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అకాల వర్షాలు జిల్లాలోని రైతులను నిండాముంచుతున్నాయి. చేతికొచ్చిన ధాన్యం తడిసి రాలిపోతుండటంతో రైతులు కంటతడి పెడుతున్నారు. రాత్రి పగలు తేడాలేకుండా ధాన్యం కురుస్తుంతఈడడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ధాన్యం కుప్పల వద్దే పడిగాపులు కాస్తున్నారు. జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి పలు మండలాల పరిధిలో ఆరబోసిన ధాన్యం పెద్ద ఎత్తున తడిసిపోయింది. కొన్ని గ్రామాల పరిధిలో కోతకు వచ్చిన వరి నేలకొరిగింది. కొనుగోలు కేంద్రాలు తెరిచిన ధాన్యం తీసుకోవడం వేగవంతం చేయకపోవడంతో రైతులు రోజులతరబడి అమ్మేందుకు వేచిచూస్తున్నారు. సీరియల్ నెంబర్ ప్రకారం కొనుగోలు చేస్తుండటంతో పొలాలు, రోడ్ల వెంట ఆరబోసి ఉంచడంతో అకాలవర్షాలతో ధాన్యం తడిసింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన అధికారులు ప్రతీరోజు ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తే తమకు ఇబ్బందులు తప్పుతాయని రైతులు విన్నవిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఒకేసారి రైతులు వరి కోస్తుండటం అమ్మకానికి ధాన్యం తీసుకువస్తుండటంతో అన్ని గ్రామాల పరిధిలో ధాన్యం నిల్వలు ఎక్కువగా ఉన్నాయి.

కొనుగోళ్లు లేక రోడ్డుపైనే ధాన్యం

జిల్లాలో అకాల వర్షాలు రాత్రివేళల్లో ఎక్కువగా పడుతుండటంతో ధాన్యం తడిచిపోతోంది. జిల్లాలోని పలు మండలాల పరిధిలో శుక్రవారం రాత్రి నుంచి జల్లులతో కూడిన వర్షాలు పడటంతో పలు గ్రామాల పరిధిలో ధాన్యం తడిచిపోయింది. అమ్మకాల కోసం రైతులు ఆరబోసి ధాన్యాన్ని ఉంచగా ఒకేసారి ఈ వర్షం పడటంతో పెద్దఎత్తున తడిచిపోయింది. జిల్లాలోని నవీపేట, డిచ్‌పల్లి, పోతంగల్, కోటగిరి, రేంజల్, ఇందల్వాయి, నందిపేట, మాక్లూర్, మోపాల్, రుద్రూర్, మోస్రా, చందూర్, ఆర్మూర్ మండలాల పరిధిలో ఈ వర్షం పడటం వల్ల ధాన్యం ఎక్కువగా తడిసింది. జిల్లాలో వరి కోతలను పెద్దఎత్తున చేపట్టిన రైతులు కొనుగోళ్లు ఊపందుకోకపోవడంతో ఎక్కువమంది రోడ్లపైనే ఆరబోస్తున్నారు. కొంత మంది సాయంత్రం సమయంలో కుప్పలు నూర్పుతుండగా మరికొంతమంది అలాగే ఉంచుతున్నారు. జిల్లాలో శుక్రవారం రాత్రి ఒకేసారి పలు మండలాల పరిధిలో ఈ వర్షం పడటంతో పెద్ద ఎత్తున ధాన్యం తడిచింది. జిల్లాలో కొన్నిచోట్ల జల్లుల కన్న ఎక్కువగా వర్షం పడటంతో వరి నేలకొరిగింది. వడగండ్ల వర్షం పడకపోవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. జల్లులతో కూడిన వర్షం పడటంతో నష్టం తక్కువగా ఉన్న ఇబ్బందులు మాత్రం తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రతిరోజు ఎక్కువ మొత్తంలో చేయాలని కోరుతున్నారు. సీరియల్ నెంబర్ల రైతులకు ఇచ్చిన కొనుగోలులో ఆలస్యం కావడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం కూడా తడవడంతో రైతులు ఆరబోసేందుకు తిప్పలు పడుతున్నారు. మళ్లీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో టార్పాలిన్‌లు, ఇతర వస్తువులను అందుబాటులో ఉంచుకొని తడవకుండా చూసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ప్రభుత్వం కొనుగోళ్లను వేగవంతం చేసే విధంగా చూడాలని కోరుతున్నారు.

రోజూ 10 వేల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను 15రోజుల కిందటే మొదలు పెట్టారు. మొదట కొన్ని కేంద్రాలను ప్రారంభించిన అధికారులు ప్రస్తుతం ఎక్కువ మొత్తంలో కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో మొత్తం 468 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 351 కొనుగోలు కేంద్రాల ద్వారా లక్షా 6791 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేశారు. వ్యాపారులు మద్దతు ధరకన్న తక్కువకు కొనుగోలు చేస్తుండగా కొనుగోలుకేంద్రాల్లో మాత్రం మద్దతు ధరకే తీసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 15,474 మంది రైతుల ద్వారా 235 కోట్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ప్రతీరోజు 10వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేస్తున్నారు. మరింత పెంచేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో వరిసాగు ముందుగానే చేయడం వల్ల నెలరోజుల నుంచే రైతులు వరి కోతలను మొదలుపెట్టారు. బోధన్ డివిజన్ పరిధిలోని రైతులు ఇప్పటికే సగానికిపైగా ధాన్యాన్ని వ్యాపారులకు అమ్మకాలు చేశారు. కొంతమంది రైతులు మద్దతు ధరకు అమ్మకాలు చేయగా మరికొంత మంది రైతులు అంతకంటే తక్కువ ధరకే అమ్మకాలను చేశారు. కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులు ధాన్యం కొనుగోళ్లను సమీక్షిస్తూ ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రైతులందరూ ధాన్యం కోతలు చేపట్టడం వల్ల భారీగా నిల్వలు అన్ని గ్రామాల పరిధిలో ఉన్నాయి.

ధాన్యం కొనుగోళ్లు లేకే నష్టపోతున్నాం..



● మహిపాల్, రైతు, మోపాల్

సొసైటీలో ధాన్యం కొనుగోళ్లు ఎక్కువగా చేయడం లేదు. ఆలస్యంగా చేపట్టడంతో ధాన్యం రోడ్లపై ఉండి అకాల వర్షాలకు తడిచిపోతుంది. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. కొన్ని సొసైటీల పరిధిలో లేబర్ రావడం కూడా ఆలస్యం కావడంతో కొనుగోళ్లు జరగడం లేదు.

కొనుగోళ్లు ఆలస్యం కావడంతోనే ప్రైవేటుకు..



● గంగారం, రైతు, కంజర్

వరి కోతలు మొదలు పెట్టి పదిరోజులైంది. ధాన్యం ఆరబోసి ఉంచాం. అకాల వర్షాలతో ధాన్యం తడిచిపోతోంది. కొనుగోళ్లు ఆలస్యం కావడంతో తక్కువ ధరకు ప్రైవేటులో అమ్ముకుంటున్నాం. సొసైటీ పరిధిలో ఎక్కువ మొత్తంలో ధాన్యం కొనుగోలు చేస్తే బాగుంటుంది.

చెరువులో స్నానానికి వెళ్లి ముగ్గురి మృతి

- సరదాగా స్నానానికి వెళ్లిన స్నేహితులు
- చెరువు లోతులో దిగి.. ఈత రాక నీటిలో మునిగిపోయిన యువకులు
- మాక్లూర్‌లోని వడ్యాట్‌పల్లిలో ఘటన



రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు



మహేష్ (ఫైల్)



నరేష్ (ఫైల్)



వెంకటేష్ (ఫైల్)



చెరువులో నుంచి వెలికి తీసిన మృతదేహాలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 13: సరదాగా చెరువులో స్నానానికి వెళ్లిన ముగ్గురు యువకులు నీటిలో మునిగి మృతిచెందారు. ఈ విషాదకర ఘటన మాక్లూర్ మండలం వడ్యాట్‌పల్లిలో శనివారం చోటుచేసుకుంది. చెరువు లోతుగా ఉండడం, ముగ్గురికీ ఈత రాకపోవడంతో ఈ విషాదం జరిగినట్లు తెలుస్తోంది. ఒడ్యాట్‌పల్లి గ్రామానికి చెందిన నీరుగొండ మహేష్ (19), కల్లెం వెంకటేశ్ అలియాస్ తిరుపతి (17), బిత్తడి నరేష్ (19), మరో ఇద్దరు స్నేహితులతో కలిసి గ్రామంలో షటిల్ ఆడారు. శనివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో షటిల్ ఆడి ఒళ్లంతా చెమటతో ఉండడంతో గ్రామానికి పక్కనే ఉన్న ధర్మాడి చెరువులో స్నానం చేసేందుకు వెళ్లారు. వీరు చెరువులో దిగిఆన ప్రాంతం లోతుగా ఉండడం, ముగ్గురికీ ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయారు. వారితో పాటు వెళ్లిన ఇద్దరు మిత్రులు ఒడ్డున ఉండి కేకలు వేయడంతో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. చెరువు లోతుగా ఉండటంతో ఈతకు దిగిన వారు ఈతరాక మునిగిపోయినట్లు తెలుస్తోంది. గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఒకేసారి మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. చెరువు వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. మాక్లూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

● దుబాయ్‌కి వెళ్లే ముందే మృత్యుఒడికి..

గ్రామంలో పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మహేష్ చెరువులో ఈతకు వెళ్లి మృత్యువాత పడటంతో విషాదం చోటుచేసుకుంది. మహేష్ మరో రెండురోజుల్లో దుబాయ్ వెళ్లాల్సి ఉందని గ్రామస్థులు తెలిపారు. ఉపాధి కోసం మహేష్ దుబాయ్ వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదంలో మృతిచెందిన వెంకటేశ్ ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాసినట్లు సమాచారం. నరేష్ సైతం పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేవాడు.

● మృత్యు కుహారాలుగా చెరువులు, కుంటలు

వేసవి సెలవులు వచ్చాయంటే చాలు చెరువుల్లో, కుంటల్లో నీళ్లలో మునిగి ఎంతో మంది విద్యార్థులు, పిల్లలు మృత్యువాత పడుతున్నారు. ప్రతీ ఏడాది ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగుతున్నా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవడం లేదు. వేసవి సెలవులకు గ్రామాలకు వెళ్తున్న పిల్లలు సరదా కోసం ఈత రాకపోయినా ఇతర మిత్రులతో కలిసి నీళ్లలో దిగి లోతును అంచనా వేయకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. సరదా కోసం ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చెరువుల కుంటల విషయంలో జాగ్రత్తలు చెప్పాలని అదేవిధంగా చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మట్టి కోసం, ఇతర అవసరాల కోసం చెరువుల పూడికలు ఇష్టారీతిన తీయడంతో చెరువుల్లో లోతు ఎంత ఉందో అంచనా వేయడం కష్టమవుతోంది. తక్కువ లోతు ఉందని దిగుతున్న పిల్లలు లోతు ఎక్కువగా ఉండి మునిగిపోయి ఈతరాక మృత్యుపడిన ఘటనలు అనేకం జరుగుతున్నాయి.

- డిసెంబర్‌లో ప్రారంభించాల్సి ఉండగా నేటికీ పూర్తి కాని పనులు
- ఎలక్ట్రిక్ బస్సుల కోసం మరికొన్ని నెలలు వేచి చూడాల్సిందే..
- జిల్లాకు సిద్ధంగా ఉన్న 58 ఎలక్ట్రిక్ బస్సులు



● కొన సాగుతున్న ఎలక్ట్రిక్ బస్సుల చార్జింగ్ పాయింట్ పనులు



● ఆవరణలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

నత్తనడకన ఎలక్ట్రిక్ బస్సుల చార్జింగ్ పాయింట్ పనులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 13: పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొస్తోంది. ఇందులో దీంట్లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో నిజామాబాద్, కరీంనగర్, తదితర జిల్లాల్లో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టేందుకు గత కొన్నినెలల క్రితం బడ్జెట్‌ను ఇచ్చింది. దీంతో నిజామాబాద్ జిల్లాలో పనులను ప్రారంభించింది. పనులు ప్రారంభించి సుమారు సంవత్సరం కావస్తున్న పనులు మాత్రం నత్తనడకగా కొనసాగుతున్నాయి. డిసెంబర్ 2023లో పనులు పూర్తిచేసి ఎలక్ట్రిక్ బస్సులను రోడ్డుపై పరిగెత్తించాల్సి ఉండగా ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. మళ్లీ ఏప్రిల్‌లో పనులు పూర్తి చేస్తామని ఆర్టీసీ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. కేవలం ఎలక్ట్రిక్ బస్సులకు సంబంధించిన కరెంటును మాత్రమే ఏర్పాటుచేశారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ సంస్థ నిజామాబాద్ డిపో-2 కార్యాలయ ఆవరణలో చార్జింగ్ పాయింట్ల కోసం ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసింది. ఇది పూర్తై చాలారోజులు కావస్తున్నా చార్జింగ్ పాయింట్లు మాత్రం ఏర్పాటు చేయలేదు.

● చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తే బస్సులు రెడీ..

ఇప్పటికే జిల్లాకు 58 బస్సులను కేటాయిస్తూ ఆర్టీసీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పనులు పూర్తయితే 58 బస్సులను నిజామాబాద్ రీజియన్ వ్యాప్తంగా రోడ్లపై నడపనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకంతో పాటు మహిళా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఏర్పడటంతో ఎలక్ట్రిక్ బస్సుల ఆవశ్యకత ఏర్పడింది. ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభమైతే కొంత మేర మహిళా ప్రయాణికుల రద్దీని తగ్గించవచ్చని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ సంస్థ చార్జింగ్ పాయింట్ల కోసం సబ్‌స్టేషన్‌ను పూర్తి చేసి ఆర్టీసీకి అందజేసింది. చార్జింగ్ పాయింట్ల కోసం ఓ ప్రైవేటు ఏజెన్సీ పనులు చేయాల్సి ఉంది. వాటిని ప్రైవేటు ఏజెన్సీ న త్తనడకన పని చేస్తోంది. నిజామాబాద్ రీజియన్‌లో మొదటగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టేందుకు ఆర్టీసీ ఉన్నత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దీంతో నిజామాబాద్ నగరంలోని డిపో-2 ఆవరణలో స్థలం ఎక్కువగా ఉండటంతో డిపో-2 ఆవరణలో చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. పనులు మొదలై సుమారు సంవత్సరకాలం గడుస్తున్నా ఇప్పటికీ పనులు పూర్తిచేయలేదు. గత కొంతకాలంగా పనులు కొంత మేర జరిగిన పూర్తి పనులు మాత్రం జరగలేదు. ప్రైవేటు ఏజెన్సీ అలసత్వం కారణంగా పనులు నత్తనడకగా కొనసాగుతున్నాయి. మరికొంత పనులు చేస్తే త్వరలో నిజామాబాద్ నగరంలో ఎలక్ట్రిక్ బస్సుల కల నెరవేరనుంది. ట్రాన్స్‌ఫార్మర్ పూర్తయి చాలా రోజులు అయినా చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఎలక్ట్రిక్ బస్సుల ప్రయాణం ఆలస్యమవుతుంది. చార్జింగ్ పాయింట్లు పూర్తి చేస్తే ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు సమాయత్తం అవుతున్నారు.

పనులను వెంటనే పూర్తిచేయాలి



● అజయ్, నగర వాసి

జిల్లాలో గత కొంత కాలంగా ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడుతున్నారని వింటున్నామే తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఎలక్ట్రిక్ బస్సుల పనులు పూర్తి చేసి జిల్లాలో ప్రజలకు ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేవాలి. వీటితో బస్సుల కొరత తీసుకుంది. పర్యావరణానికి చాలా మేలు జరుగుతుంది.

త్వరలో అందుబాటులోకి..

● జానిరెడ్డి, మేనేజర్, నిజామాబాద్ రీజియన్

త్వరలోనే నిజామాబాద్ జిల్లాలో ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. నిజామాబాద్ నగరంలోని డిపో-2 కార్యాలయంలో పనులు జరుగుతున్నాయి. కాలుష్యాన్ని నియంత్రించాలన్న ఉద్దేశ్యంతో జిల్లాలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నాం. ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వస్తే కొంతమేర ట్రాఫిక్ తగ్గుతుంది. వీటి ద్వారా కాలుష్యమూ తగ్గుతుంది.

ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిపై..

హైకోర్టులో పిటిషన్ దాఖలు

- గత ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారు..
- గత జనవరిలో వేర్వేరుగా పిటిషన్ వేసిన గత అసెంబ్లీ ఎన్నికల కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు వినయ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్13: ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారంటూ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన వినయ్‌రెడ్డి, అలాగే బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన ఆశన్నగారి జీవన్‌రెడ్డిలు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్‌లు వేశారు. 2023, నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్మూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పైడి రాకేష్‌రెడ్డి పోటీ చేసి గెలిచారు. ఈ సందర్భంగా ఎన్నికల నామినేషన్‌లో దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి తప్పుడు సమాచారం ఇచ్చారని వినయ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల సమయంలో వినియోగించిన ఐదు వాహనాలపై గతంలో విధించిన జరిమానాలు చెల్లించకుండానే వినియోగించారని పేర్కొన్నారు. అలాగే ఆస్తుల విలువను తక్కువ చేసి చూపించారని వినయ్‌రెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇలా ఉండగా.. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి కూడా హైకోర్టులో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిపై మరో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారులకు ఇచ్చిన అఫిడవిట్‌లో రాకేష్‌రెడ్డి తనపై ఉన్న కేసుల విషయం చూపలేదని జీవన్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డిపై పోటీచేసి ఓడిపోయిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు వినయ్‌రెడ్డి, ఆశ న్నగారి జీవన్‌రెడ్డి వేర్వేరుగా హైకోర్టులో పిటిష న్ దాఖలు చేయడం ఆర్మూర్‌లో చర్చనీయాంశంగా మారింది.

అయిలాపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టివేత

నందిపేట, ఏప్రిల్ 13: మండలంలోని అయిలాపూర్ గ్రామంలో పెద్ద మొత్తంలో నిల్వ ఉన్న అక్రమ మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. రహస్య సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ ఆదేశాల మేరకు స్థానిక నిజామాబాద్ ఎక్సైజ్ సీఐ దిలిప్ ఆధ్వర్యంలో ఐయిలాపూర్ గ్రామంలో దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఉప్పరి అనిల్‌కుమార్ ఇంటిని తనిఖీ చేయగా గోవా రాష్ట్రానికి చెందిన రెండు లీటర్ల చొప్పున ఉన్న బెండర్‌స్ప్రైడ్ రెండు బాటిళ్లు, మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎంసీ మెగ్‌డెవల్ 35బాటళ్లు, అలాగే ఎంసీపీఎల్ 10.3లీటర్లు, అలాగే తెలంగాణ రాష్ట్రానికి చెందిన 5.23లీటర్ల మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఎంసీ క్వాటర్‌లను సరఫరా చేసిన నిర్మల్ జిల్లా బాసర గ్రామానికి చెందిన అమ్మకంటి రాజుతో పాటు ఐయిలాపూర్‌కు చెందిన ఉప్పరి అనిల్‌కుమార్‌ను అరెస్టు చేశారు. ఇట్టి దాడుల్లో నిజామాబాద్ ఏపీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, నిజామాబాద్ ఎస్‌హెచ్‌వో అధికారులు పాల్గొన్నారు. ఎక్కడైనా ఇతర రాష్ట్రాల మద్యాన్ని విక్రయించిన, కొనుగోలు చేసిన కేసులు నమోదు చేస్తామని ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యంను విక్రయిస్తే 8712658973నెంబర్, 18004252523 టోల్‌ఫ్రీ నెంబర్ల ద్వారా సమాచారం ఇవ్వాలని, ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు.
























అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

● నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్ 13: అగ్ని ప్రమాదాల నివారణకు అప్రమత్తతతో కూడిన ముందు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను, గోడప్రతులను కలెక్టర్ శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు గోదాములలో, షాపింగ్ మాల్‌లలో ప్రమాదాలు జరుగకుండా యజమానులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈనెల 14 నుంచి 20 వరకు వారం రోజుల పాటు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు.ఈకార్యక్రమంలో జిల్లాఅగ్నిమాపక కేంద్రం అధికారి మురళీమనోహర్‌రెడ్డి, ఏడీఎఫ్‌వో భీమ్ ప్రనబ్, నర్సింగ్‌రావు,సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా వాల్‌పోస్టర్‌లను శనివారం ఏసీపీ బస్వారెడ్డి ఆవిష్కరించారు. నేటి నుంచి వారం రోజుల పాటు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తారని అన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ బస్వారెడ్డి మాట్లాడుతూ వారం రోజుల పాటు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తారని, అగ్ని ప్రమాద నివారణ పద్ధతులను ప్రతీఒక్కరు పాటించి దేశ సంపదను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌వో మధుసూదన్‌రెడ్డి, ఎల్‌ఎఫ్‌లు ప్రకాష్, అనంత్‌రావు, ఎఫ్ఎం వంశీ, రాజ్‌కుమార్, విజయేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఇందల్వాయి: అగ్నిప్రమాదాల నివారణకు అప్రమత్తతతో కూ డిన ముందు జాగ్రత్తల అవసరం ఎంతైనా ఉందని ట్రాఫిక్ ఏసీపీ నారాయ ణ అన్నారు. ఇందల్వాయి మండల కేంద్రంలోని బస్టాండ్, గన్నారం ఫైర్ స్టేషన్ వద్ద అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కరపత్రాలను ఆవిష్కరించారు. అగ్నిప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని వారం రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన గోడప్రతులను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గోదాంలలో, షాపింగ్ మాల్స్‌లలో ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈనెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అప్రమత్తంగా ఎలా ఉండాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఫైర్ సిబ్బంది సురేష్, వేణు, జైపాల్, తిరుపతి, సతీష్, మోహన్, అనంత్‌రాజ్, తదితరులు ఉన్నారు.

కేంద్రంలో అధికారంలోకి రాగానే రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ


నవీపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి

నవీపేట,ఏప్రిల్13: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేపట్టడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రఘుపతిరెడ్డి గార్డెన్స్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే ఎరువుల ధరలను పెంచిందని విమర్శించారు. నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా గతంలో బీఆర్ఎస్ పార్టీ, బీజేపీ అభ్యర్థులకు అవకాశం ఇచ్చారని ఈ సారి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తాను ఎంపీగా గెలిచిన తర్వాత బోధన్,బీదర్ లైన్‌ను పూర్తి చేయిస్తానని, బోధన్‌చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తానని,జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు క్వింటాలు పసుపుకు 15వేల ధరచెల్లించే విధంగాచర్యలు తీసుకుంటానన్నారు.అలాగే బీడీ కార్మికులకు రూ.4వేల పింఛన్, యువతకు ఉపాధి కల్పన కల్పిస్తామని హామీ ఇచ్చారు.అలాగే అన్నిరకాల పంటలకు కనీస మద్దతు ధరచెల్లించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

● జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి: బోధన్ ఎమ్మెల్యే

కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి టీ.జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలోని రఘుపతిరెడ్డి గార్డెన్స్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం పూర్తిగా వెనుకబడి పోయిందని అన్నారు. రాముడి పేరుతో బీజేపీ రాజకీయలు చేయడం శోచనీయమని అన్నారు. మండలంలోని అభంగపట్నం, అబ్బాపూర్(ఎం) గ్రామాల మధ్యన ఎర్రకుంట రిజర్వాయర్‌ను తమ ప్రభుత్వ హయంలోనే చేపట్టం జరిగిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనేక అభివృద్ధి పనులను చేపడుతుందని అన్నారు. రాబోయే నాలుగున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధిలోకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, సునీల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, బాలరాజు గౌడ్, భగవాన్, చల్ల రవీందర్ ఉన్నారు.

ధర్మ రక్షణ కోసం పాటు పడాలి : పిట్ల కృష్ణమహరాజ్


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ మహరాజ్

ఎడపల్లి, ఏప్రిల్ 13: ధర్మ రక్షణ కోసం ప్రతీ హైందవుడు పాటు పడాలని మల్లారం లింగేశ్వర ఆలయ వ్యవస్థాపకుడు పిట్ల క్రిష్ణ స్వామి అన్నారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలోని హనుమాన్ మందిరలో హనుమాన్ దీక్షా స్వాములు హనుమాన్ చాలీసాను 108 సార్లు పారాయణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జన్మ భగవంతుడు ఇచ్చిన అతి పవిత్రమైనదని మానవ జన్మలో సంపాదించిన సంపదలు వెంట రావని భక్తి, పుణ్యం, దానం, ధర్మం మాత్రమే జీవితం వెంట వస్తాయన్నారు. అంతకు ముందు హనుమాన్ మందిరంలో ఎడపల్లితో పాటు వివిధ గ్రామాల హనుమాన్ దీక్ష స్వాములు ఉదయం నుంచి హనుమాన్ చాలీసాను 108 సార్లు పారాయణం చేశారు. అనంతరం వివిధ గ్రామాల దీక్షా స్వాములు ఆలపించిన భజన, భక్తి పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. హనుమాన్ దీక్షా స్వాములు గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి వివిధ గ్రామాల గురు స్వాములను సత్కరించారు. హాజరైన హనుమాన్ దీక్షా స్వాములకు, గ్రామస్థులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్ష మండల గురుస్వామి రవిరాజ్, ఎడపల్లి గ్రామ, మండల వివిధ గ్రామాల హనుమాన్ దీక్ష స్వాములు ఉన్నారు.

ఏడాది కావస్తున్నా.. పూర్తి కాని రోడ్డు పనులు

● దోంచంద నుంచి తడపాకల్‌కు నిలిచిన బీటి రోడ్డు పనులు ● ఇబ్బందుల్లో వాహనదారులు


దోంచంద తడపాకల్ గ్రామాల మధ్య మట్టి, కంకర వేసిన రోడ్డు

ఏర్గట్ల, ఏప్రిల్ 13: మండలంలోని దోంచంద నుంచి తడపాకల్ వరకు బీటి రోడ్డు పనులు ప్రారంభమై ఏడాది కావస్తోన్న నేటికి పనులు పూర్తి కాకపోవడం. సర్వత్ర విమర్శలకు గుప్పిస్తున్నారు.. దానిపైనే ఆశలు పెట్టుకున్న అక్కడి ప్రాంత రైతులకు ప్రయాణికులు ఇబ్బందులు తప్ప డం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు వేముల ప్రశాంత్‌రెడ్డి దోంచంద నుంచి తడపాకల్ వరకు 3కిలోమీటర్ల 700 మీటర్ల వరకు ఎస్‌సీ సబ్ ప్లాన్ నిధుల నుంచి రూ.3 కోట్ల 92 లక్షలు మంజూరు చేసి గత సంవత్సరం జనవరిలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిం చారు. అయితే పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ బీటి రోడ్డు నిర్మాణంలో భాగంగా మట్టి వేసి దానిపై కంకర వేసి అక్కడక్కడ కల్వర్టులు నిర్మాణా లు చేసి చేతులు దులుపుకోవడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. అయితే దోంచంద తడపాకల్ గ్రామాలకు చెందిన రైతులు తమ వ్యవ సాయ క్షేత్రాలకు రోడ్డు పడిందని ఆశతో ఉన్న వారికి నిరాశే ఎదురైంది. రోడ్డు నిర్మాణంలో భాగంగా వేసిన కంకర రోడ్డుపై తమ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు వాహనదారులు కోరుతున్నారు.

త్వరగా పనులు పూర్తి చేయాలి



దోంచంద నుండి తడపాకల్ వరకు పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఇంకా పూర్తి కావడం లేదు. రోడ్డుపై కంకర వేయడంతో ప్రయాణీకులకు ఇబ్బందిగా మారింది.వర్షాకాలం రానుండటంతో పంట పొలాలకు వెళ్లే రైతులకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. పనులు వెం టనే ప్రారంభించాలి.

- బెజ్జంకి హన్మంత్ రెడ్డి, దోంచంద

రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తాం

గ్రామస్తుల ఫిర్యాదుల మేరకు త్వరలో రోడ్డు పనులను ప్రారంభిస్తామని అన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్ట్యా ఉన్నతాధికారులకు సమస్యను విన్నవిస్తానని తెలిపారు.పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

-ఆర్‌అండ్‌బీ అధికారి రోహిత్

యోగాతోనే మానసిక ప్రశాంతత

ముప్కాల్, ఏప్రిల్13: యోగాతోనే మానసిక ప్రశాంతత లభిస్తోందని, ప్రతీరోజు ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని పిరమిడ్ మాస్టర్ బ్రహ్మశ్రీ తటపర్తి వీర రాఘవరావు అన్నారు. శనివారం ముప్కాల్ మండల కేంద్రంలో పిరమిడ్ ధ్యాన మందిర ఆధ్వర్యంలో నిర్వహించిన ధ్యాన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని శాఖహారం భూజిస్తూ ధ్యానం చేసి ఆత్మజ్ఞానం పొందారని ఆయన బోధించారు. విద్యార్థి దశ నుంచే ధ్యానంపై అవగాహన పెంచుకొని ఒత్తిడికి జయించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌ఎస్‌ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణరెడ్డి, దయానంద్, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, సత్యనారాయణ, గంగాధ

కమ్మర్‌పల్లిలో కల్లాల్లో తడిసిన ధాన్యం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 13: శనివారం తెల్లవారుజాము నుంచి కమ్మర్‌పల్లి లో కురిసిన చిరుజల్లులకు కల్లాలు రహదారులపై ఆరబోసిన వరిధాన్యం సజ్జలు తదితర పంటలు తడిశాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరబోసిన ధాన్యం కుప్పలపై వాతావరణ మార్పులతో రైతులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తాటిపత్రలు కప్పడంతో ధాన్యం తడిసిన దాఖలాలు లేవు అయితే కొన్నిచోట్ల కుప్పలపై కప్పిన తాటిపత్రాలు గాలికి లేచిపోవడంతో వరిధాన్యం తడిసింది ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చిరుజల్లులు పడుతూ ఉండగా కొద్ది సేపటి తరువాత జల్లులు నిలిచిపోవడంతో ధాన్యం రాసులపై కప్పిన తాటిపత్రాలు తొలగిచి ఉంచారు. తిరిగి సాయంత్రం మేఘా వృతం కావడంతో మళ్లీ కప్పివేశారు.

మంత్రి, ప్రభుత్వ విప్‌ను కలిసిన ఆగ్రోస్ చైర్మన్


మంత్రిని కలిసిన ఆగ్రోస్ చైర్మన్

కోటగిరి,ఏప్రిల్13: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌లను శనివారం వారి వారి నివాసాలలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు కోటగిరి మండల నాయకులతో కలిశారు. మంత్రి, ప్రభుత్వ విప్‌లను శాలువలతో సన్మానించారు. మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొట్టం మనోహర్, పవన్ కుమార్, మధుకర్, మైనారిటీ నాయకులు కాలేక్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీపీ

నవీపేట,ఏప్రిల్13: నవీపేట ఎంపీపీ సంగెం శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో హజరైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి టీ.జీవన్ రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువాను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే నవీపేట 3 ఎంపీటీసీ డాంగే సతీష్‌తో పాటు పలు గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

విజయ్ కళాశాలలో ప్రాంగణ నియమకాలు

మాక్లూర్, ఏప్రిల్13: మండలంలోని మానిక్‌బండార్ శివారులో గల విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం హిందుస్థాన్ కోకోకోలా డెవరేజి సంస్థ ప్రాంగణ నియమకాలు చేపట్టింది. ఈ సందర్భంగా సంస్థ హెచ్‌ఆర్ కుమా రస్వామి మాట్లాడుతూ.. సంస్థలో ఉన్న వివిధ ఉద్యోగ అవకాశాలను డిప్లామా, బీటెక్ చదివిన విద్యార్థులు అర్హులని, ఎంపికైన విద్యార్థులకు సిద్దిపేటలో నూత నంగా నిర్మించిన ప్లాంట్‌లో నియామకం ఉంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లెస్ మెంట్ అధికారి డాక్టర్ శ్రీకాంత్, కళాశాల చైర్మన్ రవీందర్‌రెడ్డి, కళాశాల కార్యదర్శి అమృతలత, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

పెర్కిట్, ఏప్రిల్13: మండలంలోని గాంధీనగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యా ర్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఐఐటీ నీట్ ఫౌండేషన్ ఓలంపియాడ్ పరీక్షలలో 12మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ మానస గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు, బహుమతులు ప్రధానోత్సవ కార్యక్రమానికి మల్లారెడ్డి యూనివర్సిటీ ఎడప్ మెథ మెటిక్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ శ్రీనాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ లిథియ ముఖ్య అతి థులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలన అధికారిణి పద్మ, వైస్‌ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

నవీపేట,ఏప్రిల్13: మండల కేంద్రంలో నూతనంగా పునర్ నిర్మించిన శ్రీ సీతారామ చంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా ఆలయంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరిపె మల్లేష్, మాజీ సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్, భవంతి దేవిదాస్, తెడ్డు పోశెట్టి, శ్రీకాంత్ తదితరులున్నారు.

● రామాలయంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే

నవీపేటలో నూతనంగా పునర్ నిర్మించిన శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో శనివారం మధ్యాహ్నం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూహౌసింగ్‌బోర్డు కాలనీలో భారీ చోరీ

● కిటికీలు తొలగించి దొంగతనం
● 36 తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 13: రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో భారీ దొంగతనం జరిగింది. బంగారు ఆభరణాలతోపాటు నగదు కూడా దోచుకెళ్లారు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూహౌసింగ్‌బోర్డు కాలనీలో రూరల్ పోలీసు స్టేషన్ సమీపంలో ప్రభుత్వోద్యోగి సాయిరెడ్డి నివాసముంటున్నారు. జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఇటీవలే కొత్తగా ఇంటిని కొనుగోలుచేశారు. గురువారం ఇంటి గృహప్రవేశ కార్యక్రమం జరిగింది. కార్యక్రమం అనంతరం తిరిగి ఇంటికి వచ్చి నిద్రపోయారు. తెల్లవారుఝామున మొదటి అంతస్తు గదికి బిగించిన కిటికీలు తొలగించి దొంగలు ఇంటిలోకి చొరబడ్డారు. బీరువాలో దాచిన 36 తులాల బంగారు ఆభరణాలు, లక్షరూపాయల నగదును దోచుకెళ్లారు. విషయం గమనించిన ఇంటియజమాని సాయిరెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దాంతో రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ సిబ్బందితో ఘటనాస్థలికి వచ్చి పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఇందల్వాయి, ఏప్రిల్ 13: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగారాం తండా సమీపంలో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం ఎల్లారెడ్డిపల్లి గ్రామశివారులోని స్టోన్‌క్రషర్‌లో పనిచేస్తున్న నరేందర్, ఆశీష్, బబ్లు అనే కార్మికులు క్రషర్‌కు చెందిన వాహనంలో డీజిల్ తీసుకువచ్చేందుకు పెట్రోల్ బంక్‌కు వెళ్తుండగా గంగారాం తండావద్ద ముందర ఉన్న లారీని అతివేగంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుందని అన్నారు. ప్రమాదంలో వాహనం నడుపుతున్న నరేందర్, ఆశీష్‌లకు గా యాలు కాగాబబ్లు (45)మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వాడని అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు. శనివారం తోటి కార్మికుడు మృత్యాల సాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైతెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

బాలనగర్‌లో మహిళ అదృశ్యం

జక్రాన్‌పల్లి, ఏప్రిల్13: మండలంలోని బాలనగర్ గ్రామానికి చెందిన గుంజె చిన్నక్క(63) అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బాలనగర్ గ్రామానికి చెందిన చిన్నక్క శుక్రవారం కొడుకుతో గొడవపడి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి పోయిందని, దీనికి ఇంటికి రాలేదని, ఆమె ఆచూకి కోసం గాలించినప్పటికీ జాడతెలియరాలేదని ఎస్సై తెలిపారు. కొండుకు వెంకటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం చిన్నక్క అదృశ్యమైనట్టు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

● రూ.19,500 నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం

ఖిల్లా, ఏప్రిల్ 13: నగరంలోని రెండవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల కసాబ్‌గల్లిలో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 19,500 రూపాయల నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎల్.రామ్ తెలిపారు. ఖచ్చితమైన సమాచారం మేరకు ఓ ఇంటిపై తన సిబ్బందితో దాడి చేయగా అనుమానాస్పదంగా ఆరుగురు వ్యక్తులు ఉండటాన్ని గమనించి వారిని సోదా చేయగా పేక ముక్కలు, నగదు లభించిందన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీఎంను కలిసిన జక్రాన్‌పల్లి కాంగ్రెస్ నాయకులు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్13: సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. రాష్ట్ర మున్నూరుకాపు కార్పోరేషన్ ఏర్పాటు చేసిన సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో రాష్ట్ర మున్నూరు కాపు అధ్యక్షుడు కొండ దేవన్న మాజీసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోర్త రాజేందర్ కలిసి సీఎంను సత్కరించారు. ఈ సందర్భంగా సీఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడడం సిగ్గుచేటు

● నిజామాబాద్ టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్



మాట్లాడుతున్న దేగాం యాదాగౌడ్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 13: చట్టాన్ని కాపాడాల్సిన ప్రభుత్వ అధికారులే రాజకీయ నాయకులు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడటం సిగ్గుచేటని నిజామాబాద్ టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్‌లో ముఖ్య రాజకీయ నాయకుల పేర్లు బయటకు రావడం చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడటం సమంజసంకాదన్నారు. తెరాస ప్రభుత్వం ప్రతిపక్షాన్ని ప్రశ్నించే గొంతుకలను పోలీస్ స్టేషన్ మెట్లు కూడా ఎక్కలేని పరిస్థితికి తీసుకువచ్చిందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ నింధితులకు శిక్ష పడేలా చూడాలని ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా అధికారులు రాజకీయ నాయకులు హుందాగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబిక సత్యనారాయణ, రెంజర్ల సురేష్, బొబ్బ నర్సింహారావు, కల్లెడ గంగాధర్, శంకర్, రాములు, మల్లారెడ్డి, జాఫర్, విష్ణు, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 13: నేడు నగరంలోని తిలక్‌గార్డెన్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-2 ఏడీఈ తోటరాజశేఖర్ అన్నారు. నగరంలోని ఖలీల్‌వాడి, రాష్ట్రపతిరోడ్, గాంధీ చౌక్, నెహ్రూపార్క్, హెడ్‌పోస్టాఫీస్, కుమార్‌గల్లి, టౌన్-1 పోలీస్ స్టేషన్, సరస్వతినగర్, ప్రగతినగర్, పోచమ్మగల్లి, ముబారక్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.విద్యుత్‌వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పౌరహక్కులపై విద్యార్థులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న నీరజారెడ్డి

ధర్పల్లి, ఏప్రిల్ 13: పౌరహక్కులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా సీనియర్ న్యాయవాదులు నీరజారెడ్డి, చెలిమెల రాజేశ్వర్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాలలో పౌరహక్కులపై న్యాయవాదులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పీఎం-3 అడాలసెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. న్యాయపరమైన హక్కుల గూర్చి ఈ సందర్భంగా న్యాయవాదులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేందర్ సాహెబ్, ఉపాధ్యాయులు సబితరాణి, మంజుల, కవిత, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ రామ నవమి ఉత్సవాలు

ఎడపల్లి,ఏప్రిల్ 13:ఎడపల్లి మండల కేంద్రంలోని సనాతన శ్రీరామ మఠంలో శ్రీ రామ నవమి వేడుకలు ప్రాంభం అయినట్లు శ్రీ రామ మఠం పీఠాధిపతులు జయరాం మహారాజ్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మట్లాతూ ఉగాది పర్వదినం రోజు నుండి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయని ఈనెల 18న శ్రీ సీతారామ కల్యాణంతో వేడుకలు ముగుస్తాయన్నారు.గత 368 సంవత్సరాలుగా నవమి రోజు శ్రీరాముని జన్మదిన వేడుకలు జరిపి మరుసటి రోజు దశమి నాడు శ్రీసీతారామ కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామ మఠ పీఠాదిపతి వంశజులు పరుశురాంమహారాజ్, సురేష్ ఆత్మారాం మహారాజ్, ధనుంజయ్ మహారాజ్, ఎడపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, శ్రీనివాస్, డాక్టర్ శ్రీను తదితరలు ఉన్నారు

ఘనంగా బైసాకి పండుగ



శోభాయాత్ర నిర్వహిస్తున్న సిక్కులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 13:సిక్కులు ప్రధానంగా జరుపుకునే బైసాకి పండుగను శనివారం రాత్రి నగరంలో ఘనంగా నిర్వహించారు. సిక్కు సమాజానికి బైసాకి పండుగ ముఖ్యమైనది వైశాకికి మొదటి రోజున ఈ పండుగ వస్తున్నందున సిక్కులు కొత్త సంవత్సరంగా ఈ పండుగను జరుపుకుంటారు.నగరంలోని పాములబస్తీ గురుద్వారా నుంచి సిక్కులు విన్యాసాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. రైల్వే కమాన్, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్, బస్టాండ్, గాంధీచౌక్, పెద్దబజార్ మీదుగా గాజుల్‌పేట్ గురుద్వారా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో పెద్దసంఖ్యలో సిక్కులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మూడు మేకల మృతి

వర్నిఏప్రిల్13: వర్ని మండలం కూనిపూర్ గ్రామంలో శనివారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో మూడు మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కిష్టయ్య అనే వ్యక్తి తన మేకలను ఇంటి ముందు గల కరెంటు స్తంభానికి కట్టాడు. వర్షం కారణంగా ఎర్తింగ్ రావడంతో షాక్‌కు గురై మేకలు మృతి చెందాయి. ప్రమాదం వల్ల రూ.32వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

● పంట పొలాలను పరిశీలించిన సీపీఎం బృందం ● తడిసిన ఆరబోసిన ధాన్యం ● ఎకరాకు 30వేల నష్టపరిహారం ఇవ్వాలి



పంట పొలాలను పరిశీలిస్తున్న దృశ్యం



కురిసిన వర్షంతో తడిసిపోయిన ధాన్యం

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 13: అకాల వర్షాలు అన్నదాతకు కన్నీరును మిగిలుస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంట నీటిపాలయింది. వరిని కోసి తడి ఆరేందుకు రోడ్డుమీద ఆరబెట్టిన ధాన్యం రాత్రివేళల్లో కురుస్తున్న వర్షాలకు నీటిపాలవుతోంది. రూరల్ మండలంలోని పాల్దా, తిర్మన్‌పల్లి, శ్రీనగర్, కొత్తపేట, మల్కాపూర్ తండా వంటి పలు గ్రామాల్లో గత రెండ్రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయింది. శనివారం తెల్లవారుఝామునుంచే వర్షం కురిసింది. దాంతో తడి ఆరేందుకు రోడ్లమీద రైతులు ఆరబెట్టిన ధాన్యంపై నీరునిలిచింది. రైతులు వరి కోతలు చేపట్టినప్పటి నుంచి అకాల వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు కష్టాలపవుతున్నారు. చేతికొచ్చిన పంట తూకం వేసి రైసుమిల్లులకు తరలించే వరకు గగనముతోంది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమేకొనుగోలుచేయాలని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

ఇందల్వాయి: గత మూడు రోజులుగా మేఘావృతమై ఉన్న వాతావరణం శనివారం ఉదయం నుంచి చిరుజల్లులు కురవడంతో రైతులు ఆరబెట్టిన ధాన్యంపై నీరు నిలిచింది. రైతులు వరి కోతలు చేపట్టినప్పటి నుండి ప్రకృతి పగబట్టినట్లుగా అకాల వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చేతికొచ్చిన పంట తూకం వేసి మిల్లుకు తరలించే వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తమ ధాన్యాన్ని కాపాడుకుంటున్నారు. శనివారం తెల్లవారుజామున నుండే కురిసిన అకాల వర్షం వల్ల మండలంలోని ఇందల్వాయి, చంద్రయాన్‌పల్లి, గన్నారం, సిర్నాపల్లి, నల్లవెల్లి తదితర గ్రామాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. ప్రభుత్వం వెంట వెంటనే కొనుగోలు చేపట్టి రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని ఆదివారం రాత్రి కురుస్తున్న అకాల వర్షంతో రైతుల ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. పట్టణంలోని పిప్రి రోడ్డులో, అలూర్ బైపాస్‌రోడ్డులో ఆరబెట్టిన వరిధాన్యం అకాల వర్షం కురువడంతో ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఈ సందర్భంగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకుంటామని చెప్పుతున్న ప్రభుత్వాలు ఏ రైతులను ఆదుకోవడం లేదని, గత పదేళ్లుగా రైతులు నష్టపోతున్నారని అన్నారు. కురిసిన అకాల వర్షంతో నష్టపోయిన ప్రతీ రైతును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలో శనివారం ఉదయం నుండి మద్యాహ్నం వరకు కురిసిన వర్షానికి అమ్మకానికి కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన వరి దాన్యం తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్ కవర్లు లేకపోవడంతో అందుబాటులో ఉన్న పట్టాలతో వరి దాన్యంపై కప్పారు. అయినా దాన్యం తడవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. తడిసిన దాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో తీసుకుని రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

బోధన్‌రూరల్: బోధన్‌లో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం కురిసిన భారీ వర్షాలకు రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం వర్షపు నీటితో తడిసింది. ఈ సందర్భంగా రైతులు మళ్లీ ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. అకాల వర్షం రైతన్నలకు అపార నష్టం కలిగిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

డిచ్‌పల్లి: మండలంలో గత రాత్రి నుంచి కురుస్తున్న అకాల వర్షానికి ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. రైతులు ధాన్యాన్ని చూస్తూ తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరుతున్నారు. మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి, దూస్‌గాం, ఘన్‌పూర్, ముల్లంగి గ్రామాల రైతులు తడిసిన ధాన్యంతో తీవ్రంగా నష్టపోయారు. ఈ సందర్భంగా రైతు బల్ల భూమయ్య మాట్లాడుతూ ఉన్న రెండు ఎకరాల వరి ధాన్యాన్ని ఆరబోయగా వర్షంతో తడిసి ముద్దయ్యిందని ప్రభుత్వమేతమను ఆదుకోవాలని కన్నీళ్లపర్వతమవుతున్నారు.నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా అధికారులకు స్పష్టమైనఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు.

మోస్రా: రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి నేలకొరిగిన పంట పొలాలను శనివారం సీపీఎం పార్టీ నేతలు నన్నేసాబ్, మేకల మల్లేష్ రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలకు రైతాంగం నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు 30వేలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు నర్సయ్య, మోహన్, సిరాజుద్దీన్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. కోటగిరి, పొతంగల్ మండలాల్లో తూకం వేసిన ధాన్యం లారీలలో తరలించకపోవడంతో తూకం వేసిన చోటే తడిసి ముద్దయింది.ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రోడ్లపైకి తీసుకువచ్చారు. ఎడతెరిపి లేకుండా కురిసి వర్షానికి ధాన్యంలో నీరు చేరి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరికొందరు రైతులు ముందు జాగ్రత్తగా పట్టాలు కప్పి ధాన్యం తడకకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పొతంగల్ మండలంలోని దోమలెడ్గిలో తూకం వేసిన ధాన్యం తడిసి ముద్దవ్వడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధాన్యం సంచులను పక్కకు తీసేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నవీపేట: గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి మండలంలోని వివిధ గ్రామాలలో ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల రోడ్లపై ఆరబోసిన ధాన్యం రాసులు ఉండగా మరికొన్ని చోట్ల కల్లాల్లో ధాన్యం తడిసిపోయింది. ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో పలుచోట్ల వరిపంట నేలరాలింది. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కోటగిరి: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు పరిశీలించారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వర్షానికి రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. వ్యవసాయ అధికారి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు పలు సూచనలు అందించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని రైతులకు వివరించారు. ధాన్యంలో నీరు నిల్వ లేకుండా ఆరబెట్టాలని రైతులకు సూచించారు.

రెంజల్: మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం కురిసిన వర్షంతో తడిసిన ముద్దయిన ధాన్యాన్ని శనివారం ఉదయం వ్యవసాయ శాఖ అధికారులు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఓ మోస్తరు వర్షం కురవడంతో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి వర్షం రావడంతో పంట నష్టం జరిగిందని నష్టపోయిన రైతులు అధైర్య పడద్దన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. తడిసిన ధాన్యంపై పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు అజయ్, గోపికృష్ణ, కృష్ణ వేణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

● కొన్న ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలి : కలెక్టర్



తిర్మన్‌పల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఇందల్వాయి, ఏప్రిల్ 13: జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడ రైతుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తరుగు తీస్తున్నారా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కలెక్టరేట్‌లో ఉన్న కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నెంబర్ 1967కు గానీ 180042500333 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతిరోజు నిర్ణయించుకున్న లక్ష్యానికి అనుగుణంగా ధాన్యాన్ని సేకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు తూకం వేయడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే వాహనాల ద్వారా రైస్‌మిల్లులకు తరలించాలని ఆదేశాలు ఇచ్చారు. ధాన్యం అన్‌లోడ్ చేయడంతో పాటు వెంటవెంటనే వాహనాలు మళ్లీ కొనుగోలు కేంద్రాలకు వచ్చే విధంగా చూడాలన్నారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లతో పాటు ఇతర వస్తువులను అందుబాటులో ఉంచాలని కోరారు. రైతులు తొందరపడి దళారులను ఆశ్రయించవద్దని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మకాలు చేయాలన్నారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రతీఒక్కరు ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యం పరిశీలించిన వారిలో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీసీవో శ్రీనివాస్‌రావు, డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లై జీఎం జగదీశ్, ఇతర అధికారులు ఉన్నారు.

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ధర్పల్లి, ఏప్రిల్ 13: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని ఒన్నాజిపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని సూచించారు. వరిధాన్యాన్ని తడవకుండా రైతులకు తాటిపత్రిలను అందజేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చూడాలన్నారు. ఈ సందర్భంగా నడిమితండా, కొటాల్‌పల్లి రైతులు తమ గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రెండు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట డీఎస్‌వో చంద్రప్రకాశ్, డీసీవో శ్రీనివాస్, డీఎం జగదీశ్‌కుమార్, ఎండీవో బాలకృష్ణ, తహసీల్దార్ మాలతి, ఏవో ప్రవీణ్‌కుమార్, ఏపీఎం సునీత, ఏపీవో వినోద, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

బోధన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు



ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతులు చేపడుతున్న ట్రాన్స్‌కో సిబ్బంది

బోధన్‌రూరల్,ఏప్రిల్13: ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలగకుండా నిత్యం పర్యవేక్షిస్తున్నామని ట్రాన్స్‌కో డీఈ ముక్తార్ అన్నారు. బోధన్‌లో శనివారం ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతులలో భాగంగా ట్రాన్స్‌కో సిబ్బంది పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లుకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలో సాయంత్రం విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో డీఈ ముక్తార్ మాట్లాడుతూ నెలలో ఒకసారి మరమ్మతులు చేపడుతున్నామని, ప్రజలకు విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిబ్బంది తదితరులున్నారు.

నేడు ధర్మారంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 13:మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధి ఎడవెల్లి సోమనాథ్ తెలిపారు. అంబేద్కర్ జయంతి వేడుకలకు ప్రముఖులు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకల్లో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అన్నారు.

హామీలను అమలు చేయని కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పాలి

● ఎంపీ ధర్మపురి అర్వింద్



మామిడిపల్లిలో చాయ్ పే చర్చలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

ఆర్మూర్‌రూరల్,ఏప్రిల్13:రైతులకు, మహిళలకు ఇచ్చిన హామీల ను అమలు చేయలేని కాంగ్రెస్ పార్టీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. శని వారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ హోటల్ వద్ద స్థానికులు, రైతులతో కలిసి టీ తాగుతూ ముచ్చటిం చారు. మామిడి పల్లి ఆర్‌వోబీ పనులను వెంటనే పూర్తి చేయించాలని గ్రామస్థులు కోరారు. రైల్వేలైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన పేదలను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరగా రైల్వే అధికారులతో చర్చించి తనవంతు కృషి చేస్తానని ఎంపీ సమాధానం ఇచ్చారు. నిజాంసాగర్ కాలువలో సిమెంట్ వేయడంతో భూగర్భజ లాలు మామిడిపల్లిలో పెరగకపో వడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు వి వరించారు. అనంతరం ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోలేద న్నారు. ఆరు గ్యారెంటి పథకాల హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా ప్రజల సమస్యలను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వర్షాలు కురిసిన ధాన్యం తడిసి ఇబ్బందులు ఎదురవుతు న్నాయని, కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి ఉంటే సమస్యలు వచ్చేవి కావన్నారు. రైతులకు రుణమాఫీ, రూ.500బోనస్ హామీ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజల కోసం పని చేసే నిజాయితీ పరులను ఎన్నుకోవాలని, ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే వారిని అభివృద్ధి పనులు జరిపించే వారిని గెలిపించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశాభి వృద్ధి సాధ్యమవుతుందని, ఇప్ప టికే ప్రజలు గ్రహించారని, మరోమరు బీజేపీని గెలిపించాలని కోరారు.రానున్న ఎన్నికల్లో నరేంద్రమోదీకి అండగా నిలిచి బీజేపీని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎంపీ అర్వింద్ కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పుప్పాల శివరాజ్, కలి గోట గంగాధర్, జెస్సు అనిల్, రాజేష్, పొల్కం వేణు, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో యువతికి మోసం



మాట్లాడుతున్న బాధితురాలు విఘ్నేశ్వరి

పెద్దబజార్, ఏప్రిల్ 13: ప్రేమ పేరుతో వివాహం చేసుకొని మోసం చేశాడంటూ యువతి విఘ్నేశ్వరి ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిజామాబాద్ రూరల్ మండలంలోని ఆకుల కొండూర్ గ్రామానికి చెందిన మాదాస్తు విఘ్నేశ్వరిని అదే గ్రామానికి చెందిన దీపక్ అనే యువకుడు సంవత్సరన్నర నుంచి ప్రేమించాడని అన్నారు. ఆరు నెలల క్రితం వివాహం చేసుకున్నాడని ఈక్రమంలో తాను గర్బవతి అయ్యా యని తెలిపింది.ఇప్పుడు నువ్వునాకు వ ద్దంటూ చెబుతున్నాడని అన్నారు. దీపక్ కుటుంబ సభ్యులు వచ్చి తనకు అబార్షన్ చేయించారని పేర్కొన్నారు. అదే విధంగా తనను దీపక్ కుటుంబ సభ్యులు కులం పేరు తో దూషిస్తూ ఇబ్బందులకుగురి చేస్తున్నారని తెలిపారు.తా ము ఇద్దరం కొద్దిరోజుల క్రితం హైదరాబాద్‌లోని అపోల ఆసుపత్రిలోని మెడికల్‌లో ఫార్మసిస్టుగా పనిచేశామన్నారు.నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పోలీసులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు.ఈ సమావేశంలో బీఎల్‌ఎఫ్ మహిళా నాయకురాలుసబ్బునిలత, బాధితురాలి బంధువులు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీయూలో గ్రాండ్ టెస్ట్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 13: తెలంగాణ విశ్వవిద్యాలయంలో నేడు రాష్ట్రస్థాయి గ్రూప్-2, ఎస్సై, కానిస్టేబుల్ శిక్షణకు అభ్యర్థులకు ఐఏసీఈ వారి సౌజన్యంతో టెస్ట్ నిర్వహణ ఏర్పాటు చేస్తున్నట్లు వర్సిటీ గిరిజన విభాగం అధ్యక్షుడు సీనునాయక్ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఇట్టి నిర్వహణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.170	రూ.300	రూ. 320
వెన్‌కాబ్(కిలో)	రూ.175	రూ.305	రూ. 325

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.75,500	రూ.69,400	రూ.870

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మైదాన్ (హిందీ) (9.15)
: ఫ్యామిలీ స్టార్ (1.05, 10.30)
: టిల్లు స్క్వేర్ (4.30, 7.30)
స్క్రీన్-2 : బడే మియాన్ చోటే మియాన్ (తెలుగు) (10.00, 7.05)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (1.30)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (4.05)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ 3డీ) (10.35)
స్క్రీన్-3 : లవ్‌గురూ (1.10, 7.15)
: డియర్ (4.20)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (10.25)
స్క్రీన్-4 : మైదాన్ (హిందీ) (12.00)
: మంజుమ్మల్ బాయ్స్ (3.50, 6.35)
: లవ్ గురూ (10.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : గీతాంజలి మళ్లీ వచ్చింది (10.40)
: టిల్లు స్క్వేర్ (1.30, 10.40)
: ఫ్యామిలీ స్టార్ (4.20, 7.30)
స్క్రీన్-2 : మంజుమ్మల్ బాయ్స్ (11.00)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (1.30, 7.35)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ) (4.30, 10.20)
స్క్రీన్-3 : డియర్ (10.55)
: మంజుమ్మల్ బాయ్స్ (2.00, 4.45, 10.45)
: మైదాన్ (హిందీ) (7.20)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : బడే మియాన్ చోటే మియాన్ (హిందీ) (11.00, 6.00)
: మైదాన్ (హిందీ) (2.00, 9.00)
విజయ్ : గీతాంజలి మళ్లీ వచ్చింది (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్